ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

ఆదివారం 2 నవంబరు 2025 | 5

భక్తవత్సల.. గోవిందా..

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం.. స్వామికి ప్రత్యేక పూజలు

6

సేవలకు సీఎం ప్రశంసలు!



తుఫాన్ పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, దేవ వరప్రసాద్, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ... మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఆర్డీవో కె.మాధవిలకు శనివారం అమరావతిలో సీఎం చంద్రబాబు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

చూడు.. దేవుడా!?



ఇలాగైతే ఎలా : తొలి తిరుపతిలో భక్తుల రద్దీ



వాడపల్లిలో..తప్పదింతే..

ప్రాణాలతో చెలగాటమే

- ఉమ్మడి జిల్లాలో పలు ఆలయాలు
- అంతంతమాత్రంగా క్యూలైన్లు
- రద్దీ పెరిగితే..తప్పదు ముప్పు
- కార్తీకమాసం.. కానరాని ఏర్పాట్లు
- ఆదాయమున్నా.. సౌకర్యాలు సున్నా
- కాశీబుగ్గ ఘటనతో ఉలికిపాటు

చూడు..దేవుడా ఎంత పని జరిగిందో.. నిన్ను చూద్దామని వస్తే.. నీ దగ్గరికే తీసుకెళ్లిపోయావు.. ఎవరిది తప్పయినా.. ఎవరిది నిర్లక్ష్యమైనా ఏమీ చేయలేని పరిస్థితి.. అసలే కార్తీకమాసం.. ఆలయాల్లో తాకిడి భారీగా ఉంటున్న తరుణంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది దుర్మరణం చెందిన ఘటన భక్తులను ఉలిక్కిపడేలా చేసింది. ఎందుకంటే ఆ శివారు అంతర్వేది నుంచి ఈ శివారు అన్నవరం వరకు, వాడపల్లి నుంచి పెద్దాపురం తొలి తిరుపతి వరకు భక్తుల రద్దీ అంచనాలకు మించి ఉంటోంది. కాశీబుగ్గ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి వ్యాప్తంగా తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతోంది.



అన్నవరాన..ఆపసోపాలే..

ఉమ్మడి జిల్లాలో ప్రముఖ ఆలయాల దగ్గర నుంచి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని దేవాలయాల వరకు భారీగా భక్తులు పోటెత్తితే తట్టుకునే క్యూలైన్ల సామర్థ్యం లేదు. కేవలం గర్భగుడికి కొంచెం సమీపంలో మినహా ఎక్కడా బలమైన రైలింగ్‌లు ఉండవు. దీంతో సజావుగా జరగాల్సిన దర్శనాలు అనుకోని ఘటనలు జరిగితే ఎక్కడ ఏ ప్రమాదం తెచ్చిపెడతాయోనన్న భయం వ్యక్తమవుతోంది. అసలే కార్తీకమాసం కావడంతో వాడపల్లి వెంకన్న ఆలయం మొదలు అన్నవరం, అంతర్వేది, పెద్దాపురం తొలి తిరుపతి తదితర ఆలయాలకు అంచనాలకు మించిన భక్తులు పోటెత్తుతున్నారు. కానీ వీటిలో క్యూలైన్ల రక్షణ వ్యవస్థ చూస్తే అంతంత మాత్రమే. అటు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని ఆలయాలకు ఇటీవల అనూహ్యంగా భక్తులు పోటెత్తుతున్నారు. తాజా ప్రమాద ఘటనతో ప్రైవేటు నిర్వహణలో ఉన్న ఆలయాలపైనా దేవదాయశాఖ తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచారామాల్లో పట్టించుకోండి..

ద్రాక్షారామ/సామర్లకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచారామాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. జిల్లాలో పంచారామ క్షేత్రాలు రెండు ఉన్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయాలు ఉన్నాయి. ద్రాక్షారామలో కార్తీకమాసం ఆరంభం నుంచి ఉచిత దర్శనం క్యూలైను తూర్పుగోపురం నుంచి ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం రూ.50, విశిష్ట దర్శనం రూ.10 క్యూలైన్లు మార్పులు చేశారు. రూ.50 దర్శనం లైన్లు అంతరాలయంలోకి ప్రవేశం నిలిపివేశారు. మొదటి గుమ్మం నుంచి దర్శనం చేసుకునేలా ఏర్పాటుచేశారు. రెండు చోట్ల భక్తుల రద్దీని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వాడపల్లి వెళ్లినా ఇబ్బందే!

ఆత్రేయపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి శనివారం సుమారు 50 వేల నుంచి 60 వేల మంది భక్తులు వస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను విస్తరించినా అప్పుడప్పుడు తోపులాటలు జరుగుతున్నాయి. క్యూలైన్లలో భక్తులకు ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే బయటకు వచ్చే మార్గం లేక ఇబ్బందులేర్పడుతున్నాయి. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు ఆలయంలో కానరావడం లేదు. ఆలయ ప్రాంగణంతో పాటు అన్నదానం నిర్వహించే ప్రదేశాలు రద్దీగానే ఉంటాయి. మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రత్నగిరి..రద్దీకి ఏర్పాట్లేవి?

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి ఆలయంలోనూ భక్తుల రద్దీ నియంత్రణపై అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ జరగనుంది. ప్రతి ఏటా స్వామివారి గిరి ప్రదక్షిణ పల్లకీసేవ, సత్యరథం ఒకేసారి జరిగేవి. దీంతో భక్తులు ఒకేసారి పశ్చిమ రాజగోపురం వద్ద ఉండిపోవడంతో రద్దీ నియంత్రించలేక పశ్చిమ రాజగోపురం తలుపులు మూసివేసిన ఘటనలు జరిగాయి. ఈ ఏడాది సత్యదేవుడి గిరిప్రదక్షిణ పల్లకిలో ఉదయం 8 గంటలకు.. సత్యరథంతో భక్తులు పాల్గొనేందుకు మధ్యాహ్నం 2గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మధ్యాహ్నం సత్యరథం వెంబడి గిరిప్రదక్షిణ అనే విషయం భక్తుల్లోకి పూర్తిగా చేరకపోవడంతో వారంతా ఉదయం పల్లకీ వెంట గిరిప్రదక్షిణకు సిద్ధమవుతున్నారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రత్నగిరిపై విపరీత రద్దీ ఉండే అవకాశాలున్నాయి. 2 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా.

తొలి తిరుపతి ఇబ్బందే మరి?

పెద్దాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం దివిలిలో ఉన్న తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. ప్రతీ శనివారం స్వామి దర్శ నానికి సుమారు 8 వేల నుంచి 10 వేల మంది భక్తులు వస్తారు. అయితే భక్తులకు సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2022 నవంబరులో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయం లోపల తొక్కిసలాట జరిగింది.దీంతో పలువురు భక్తులు గాయపడ్డారు. భక్తులను నియంత్రించేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసినా ఆలయ పరిసరాలు ఇరుకుగా ఉండడంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఉంది.

అంతర్వేదిలో అత్యవసర ద్వారాల్లేవ్!

అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. విశేషమైన రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుంటూ ఉంటారు. మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణానికి, కార్తీకమాసంలో స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అయితే ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ఆలయానికి లేకపోవడంతో ఇబ్బంది ఉంది.

క్యూలైన్లు లేవు.. పవన్ సారూ..

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం) డిప్యూటీ సీఎం పవన్ నియోజకవర్గం పిఠాపురంలో ప్రధాన ఆలయాలకు క్యూలైన్లు లేవనే చెప్పాలి. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోనే క్యూలైన్లు 400-500 మంది భక్తులు వస్తే నిండిపోతాయి. పర్వదినాల్లో 10 వేల నుంచి 25 వేల మంది భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలకు, కుక్కుటేశ్వర స్వామి, శక్తి పీఠం పురుహూతికా అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినాల్లో సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా ప్రస్తుతం ఏర్పాట్లు లేవు.



‘కర్పూర’కు డిమాండ్

- అరటి గెల ధర గరిష్ఠంగా రూ.600
- కళకళలాడుతున్న రావులపాలెం అరటి మార్కెట్ యార్డు
- పెరిగిన ఎగుమతులు.. అధిక శాతం ఒడిశాకే..

6

అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శర్మ



డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శర్మ

అమలాపురం రూరల్, నవంబరు 1(ఆం ధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా డీఎల్ఎన్ శర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్ హెడ్ ఆఫీస్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న శర్మకు పదోన్నతి రావడంతో డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. రావులపాలెం డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం డిపోలో అన్ని సెక్షన్లను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి డిపోను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన సూచించారు. వివిధ యూనియన్ల నాయకులు, డిపో సిబ్బంది అభినందనలు తెలిపారు.



లక్ష్మీపోలవరంలో ఎల్ఈడీ లైట్ల తయారీ కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఎల్ఈడీ యూనిట్లు పర్యావరణ హితంగా నిర్వహించాలి : కలెక్టర్

రావులపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఈడీ యూనిట్ల తయారీ విధానాన్ని పర్యావరణ హితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. రావులపాలెం మండలంలోని లక్ష్మీపోలవరంలో ఉన్న ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు, ఇండోర్ ఎల్ఈడీ లైట్లు, బల్బులు తయారీ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి తయారీ నిర్వహణ ద్వారా పర్యావరణానికి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా వాయు, నీటికాలుష్యాన్ని నివారించాలని నిర్వాహకులు సూచించారు. బ్రాండెండ్ కంపెనీలు అయిన బజాజ్, పోలీక్యాబ్, గోల్డ్‌మెడల్, స్టార్‌లైట్ కంపెనీలకు చెందిన ఎల్ఈడీ బల్బులను ఇక్కడ తయారు చేయడం జరుగుతోందన్నారు. మార్కెటింగ్ మెటీరియల్ దిగుమతి, అసెంబ్లీ లైన్లు, టెస్టింగ్ పరికరాలు, ప్యాకేజింగ్ యంత్రాలు, తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ టెస్టింగ్ విద్యుత్ భద్రత, దీర్ఘకాలిక మన్నిక పరీక్షలు, ప్రామాణిక ధ్రువీకరణ పత్రాలు ఆయన పరిశీలించారు. ప్రతి ఉద్యోగికి భద్రతా మార్గదర్శకాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ వ్యవస్థాపకులు అశ్వినికుమార్, పలువురు పాల్గొన్నారు.



వెదిరేశ్వరంలో దెబ్బతిన్న అరటి తోట పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ దెబ్బతిన్న పంటల పరిశీలన

రావులపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం కారణంగా దెబ్బతిన్న పంటలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. రావులపాలెం మండలం వేదిరేశ్వరంలో కలెక్టర్, అరటి ఉద్యాన పంటపొలాలను పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా 4356 మంది రైతులకు చెందిన 1429 హెక్టార్లలో 33 శాతం పైబడి నష్టం వాటిల్లిందన్నారు. ఉద్యాన పంట నష్టాల లెక్కింపులో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.35 వేలు నష్టపరిహారం నిర్ధారించిందన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. పంటనష్టంపై రైతులను ఆరా తీశారు. ఒక హెక్టారుకు రైతు ఎంతవరకూ పెట్టుబడి పెట్టారని అడిగారు. ఆర్డీవో శ్రీకర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ, ఉద్యానాధికారి జి.కోటేశ్వరరావు, తహశీల్దారు ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

ఈసారి కాస్త ఆలస్యం!

- నవంబరు నెల 1న తెల్లకార్డులకు అందని బియ్యం
- డిపోలకు చేరని రేషన్ బియ్యం
- ముందస్తు పంపిణీతో ఖాళీ అయిన డిపోలు
- బియ్యం వాహనాలన్నీ తీరప్రాంత గ్రామాలకే పరుగులు
- మరో రెండు రోజులు పడుతుందంటున్న అధికారులు

ఉప్పలగుప్తం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీ నుంచి అందుబాటులో ఉంటున్న రేషన్ బియ్యం ఈసారి లేవు. ఒకటి రెండు రోజులు ఆలస్యంగా పంపిణీ కావొచ్చు. శనివారం రేషన్ దుకాణాల ద్వారా నెలనెలా తెల్లకార్డులకు ఇచ్చే బియ్యం పంపిణీ జరగలేదు. ప్రతి నెలా 20వ తేదీ నాటికి రాబోయే నెల పంపిణీకి బియ్యాన్ని డిపోలకు చేర్చేవారు. అక్టోబరులో కాంట్రాక్టర్ల సమ్మెతో బియ్యం రవాణా నిలిచిపోయింది. 25వ తేదీ నాటికి వృద్ధులకు పంపిణీ కోసం ప్రతి నెలా ఇచ్చినట్టే కొంత మొత్తంలో బియ్యాన్ని డిపోలకు చేరవేశారు. ఇంతలోనే తుఫాను కారణంగా అవసరమైన వారు నవంబరు నెల బియ్యాన్ని ముందుగానే తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో డిపోల వద్ద జనం క్యూకట్టారు. ప్రతి రేషన్ దుకాణంలోను ఉన్న బియ్యం ఖాళీ అయ్యాయి. రేషన్ దుకాణాలకు బియ్యం చేరవేసే వాహనాలన్నీ తుఫాను బియ్యం పంపిణీ నిమిత్తం తీరగ్రామాలకు తరలిపోతున్నాయి. దీంతో మండలాల్లో నవంబరు బియ్యం పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ఉదాహరణకు ఉప్పలగుప్తం మండలంలో 36 రేషన్ దుకాణాలున్నాయి. నెలనెలా 2,954.24 క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతుంది. ఈ మొత్తాన్ని అంచెలంచెలుగా ప్రతి నెలా 20వ తేదీ నాటికే రేషన్ దుకాణాలకు చేరవేస్తుంటారు. ప్రతి నెలా మొదటి తేదీ నుంచి ప్రారంభం కావలసిన బియ్యం పంపిణీ ఈనెల జరగదని అధికారులే అంటున్నారు. తుఫాను కారణంగా నవంబరు నెల బియ్యం అవసరమైతే ముందుగానే తీసుకోవచ్చన్న ప్రభుత్వ ప్రకటన ప్రకారం ప్రతి దుకాణం నుంచి అక్టోబరు 28న వందల మంది బియ్యం తీసుకున్నారు. దీంతో డిపోల్లో సరుకు మొత్తం ఖాళీ అయ్యింది. ముందస్తు పంపిణీ డీలర్లకు తలపోటు తెచ్చిపెట్టింది. తుఫాన్ కారణంగా ఆ బియ్యం ఇచ్చారని, నవంబరు నెల బియ్యం మామూలుగానే ఇవ్వాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు. నవంబరు నెల బియ్యం అని ఎంత చెప్పినా వారి చెవికెక్కడం లేదు. ముందస్తుగా నవంబరు నెల బియ్యం తీసుకున్న వారికి పంచదార ఇచ్చారు. మిగిలిన పంచదారను సివిల్ సప్లయిశాఖ పంపిణీ చేయకుండా బ్లాక్ చేసింది. ఈనెలలో బియ్యం తీసుకునే వారికి పంచదార ఇవ్వరని తెలుస్తోంది. ఈ పంచదారను తీరప్రాంత గ్రామాల్లో పంపిణీకి వెనక్కి తీసుకుంటారని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పలువురు కార్డుదారులు తమకు తుఫాను బియ్యం ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. రేషన్ డిపోలకు మరో రెండు రోజుల వరకు బియ్యం చేరవేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. బియ్యం వచ్చిన వెంటనే మిగిలిన కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని చెబుతున్నారు.

అత్యాచార నిందితుడిపై రౌడీ షీట్ తెరుస్తాం

నిందితుడిపై గతంలో నోట్లమార్పిడి, బైక్ చోరీ కేసులు : అమలాపురం డీఎస్పీ

7





ఈదరపల్లి, కామనగరువుల్లో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

జిల్లాలో 2.36 లక్షల మందికి రూ.102 కోట్లు

ఈదరపల్లి, కామనగరువుల్లో పెన్షన్లు పంపిణీ చేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్


అమలాపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,36,237 మంది లబ్ధిదారులకు ఈనెల రూ.102 కోట్లు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈదరపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. స్థానిక అంబేడ్కర్‌కాలనీలో స్వయంగా ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించే విధంగా నెలనెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేతివృత్తులతోపాటు మిగిలిన అన్ని వర్గాలవారికి ఇంటి వద్దకే తీసుకువెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. పెన్షన్ల పంపిణీని జియో కోఆర్డినేట్ చేయడం వల్ల పారదర్శకత పెరిగిందన్నారు. లబ్ధిదారులు ఇతరులపై ఆధారపకుండా స్వీయ గౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తూ పెన్షన్లను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్, డిప్యూటీ ఎంపీవో శాస్త్రి, డీఆర్డీఏ డీపీఎం డీవీఎల్ అన్నపూర్ణ, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కామనగరువు పంచాయతీ కార్యాలయం పరిధిలో సామాజిక భద్రతా పెన్షన్లను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పర్తంశెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

శాటిలైట్ ఇమేజ్ వెరిఫికేషన్‌తో

పంట నష్టం అంచనా

రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా రాయవరం మండలం ఎంపిక

6



పగలంతా కాంతి.. రాత్రికి విశ్రాంతి!

పగలంతా కాంతివంతంగా ప్రకాశించి.. రాత్రికి విశ్రాంతి తీసుకోవడానికి వెళ్తున్నట్టుగా సూర్యుడు అస్తమిస్తూ ఇలా కాకినాడ-సామర్లకోట రోడ్డులో శనివారం సాయంత్రం ఇలా కనిపించాడు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

-ఆంధ్రజ్యోతి, కాకినాడ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



అల'వేటే' తప్పదు మరి!

సముద్రంలో పోటైనా.. పాటైనా.. అల..వేట అలవాటు మరి.. సాపాటు కోసం వల విసరడం చేపల కోసం వేటాడడం వారికి తప్పదు మరి.. ఓ మత్స్యకారుడు కాకినాడ-ఉప్పాడ రోడ్డు పక్కన ఇలా సముద్రంలో వేటాడుతూ కనిపించాడు.

-ఆంధ్రజ్యోతి, కాకినాడ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దొంగల..హోల్‌సేల్!

- కాకినాడలో చోరీ సెల్‌ఫోన్ల రికవరీ
- వాటి విలువ రూ.కోటి36లక్షలు
- ఇప్పటివరకు రికవరీ చేసినవి 3,351
- బాధితులకు ఫోన్లు అందజేసిన కాకినాడ జిల్లా ఎస్పీ

కొట్టేసిన ఫోన్‌లు 800



కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో రికవరీ చేసిన ఫోన్లను మీడియాకు చూపిస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఇతర పోలీసులు

ఒకటి కాదు.. రెండు కాదు.. వంద అంత కన్నా కాదు.. మొత్తం 3,351 మొబైల్ ఫోన్ల రికవరీ.. ఇప్పటివరకు కాకినాడ జిల్లా పోలీసులు పది విడతల్లో రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల సంఖ్య ఇది. వీటి విలువ ఎంతో తెలుసా? రూ.5కోట్ల37లక్షల77వేలు.. ఇక పదో విడతలో భాగంగా శనివారం బాధితులకు అందజేసిన మొబైల్‌ఫోన్లు 800. వాటి విలువ రూ.కోటి36లక్షలు. ఇవి కేవలం చోరీకి గురై దొరికినవి మాత్రమే. దొరకనివి ఇంకా వేలల్లోనే ఉంటాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు తిరిగి వాటిని అప్పగించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మీడియా ప్రతినిధుల సమక్షంలో మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఆపరేషన్ మొబీ ట్రాక్ కింద జిల్లా సైబర్ క్రైం పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులు ఉపయోగించి భారీ మొబల్ రికవరీ ఆపరేషన్‌లో పాల్గొన్నారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటివరకు పది విడతల్లో మొత్తం రూ.5,37,77,000 విలువైన 3,351 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. పదోవిడతలో రూ.1,36,00,000 విలువ చేసే 800 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన పలువురికి మొబైల్ ఫోన్లు అందజేశారు. ఐటీకోర్‌టీం ఉపయోగించిన ఎంఎంటీఎస్(మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్), సీఈఐఆర్ ద్వారా వీటి రికవరీ సాధ్యమైందని ఎస్పీ తెలిపారు.

ఫోన్ పోతే.. ఇలా చేయండి..

మొబైల్ మిస్సయిన సమయంలో తక్షణ చర్యగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు.బ్యాంకు ఖాతాలను తక్షణమే బ్లాక్ చేయించాలి. సిమ్‌కార్డు నెంబర్‌ను ఆలస్యం చేయకుండా నిలిపివేయించాలి. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి ఆర్థికపరమైన యాప్‌లు/ అప్లికేషన్లకు 2 ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించాలి. మొబైల్ పోయిన వెంటనే గూగుల్/ఆపిల్ ఐడీ, బ్యాంకింగ్ యాప్స్, వాట్సాప్, మెయిల్, సోషల్ మీడియా వంటి వాటి పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలి.

●ఆండ్రాయిడ్ ఫోన్లకు ఫైండ్ మై డివైజ్, ఐ ఫోన్లకు ఫైండ్ మై ఐఫోన్(ఐక్లౌడ్) ఫోన్‌ను ట్రాక్ చేయడం, రింగ్ చేయడం, లాక్ చేయడం లేదా డేటా డిలీట్ చేయడం చేయాలి.

●సీఈఐఆర్.జీవోవీ.ఇన్ పోర్టల్‌ద్వారా లేదా కాకినాడ ప్రజలు మొబీ ట్రాక్ నెంబర్ 94906 17852కు వాట్సాప్ యాప్ హాయ్ లేదా హలో లేదా ఏదైనా మెసేజ్ పంపి తిరిగి మొబైల్‌కు వచ్చిన ఫైల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొంటున్నారా?

సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనేటప్పుడు ఫోన్ బిల్లు, సెల్ ఫోన్ బాక్స్, ఫోన్ అమ్మే వ్యక్తి గురించి సరిగా పరిశీలించాలి. అపరిచితుల నుంచి ఫోన్లను కొనుగోలు చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

దొంగలు మాత్రం చిక్కడం లేదా?

వేలకొద్దీ సెల్‌ఫోన్లు పోవడం, వాటిలో కొన్నింటిని పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించడం కొంతకాలంగా జరుగుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఫోన్లు చోరీ కావడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడం తక్కువే. ఎక్కడో జేబులోంచి జారిపడడం, ఎక్కడైనా పడిపోవడమో, మరిచిపోవడం వంటి సమయంలో మొబైల్ ఫోన్లను కోల్పోతుంటారు. కొందరు ఫోన్‌లు చోరీ చేసేవారు ఉంటారు. ఇటీవల కాలంలో ఇలాంటి చోరులే అధికమయ్యారు. రూ.20, రూ.50 నోట్లను రోడ్డు మీద వేయడం.. వాటిని తీసుకోవడానికి ఎవరైనా ప్రయత్నించే క్రమంలో జేబులో ఉన్న ఫోన్లు కొట్టేయడం దొంగలకు అలవాటుగా మారింది. బైక్‌పై నుంచి పడిపోతున్నట్టుగా నటించడం, అది చూసి లేపుదామని వచ్చిన వారి జేబులో నుంచి వేరొక వ్యక్తి సెల్‌ఫోన్ కొట్టేయడం కొన్నిచోట్ల జరుగుతోంది. ఇలాంటి వారెవరూ పోలీసులకు చిక్కడంలేదు. వీటిని కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారినీ పోలీసులు చూపడం లేదు. ఎవరైతే ఈ దొంగ మొబైల్స్ కొనుగోలు చేసి సిమ్ కార్డు వేసి వినియోగిస్తున్నారో వారి నుంచే రికవరీ చేస్తున్నారు. దొంగల వివరాలు మాత్రం చెప్పలేకపోతున్నారు.

'కర్పూర'కు డిమాండ్

- అరటిగెల ధర గరిష్ఠంగా రూ.600
- కళకళలాడుతున్న రావులపాలెం అరటి మార్కెట్ యార్డు
- పెరిగిన ఎగుమతులు.. అధిక శాతం ఒడిశాకే..



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో కర్పూర గెలలతో రైతులు

రావులపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం, తుఫాన్ ప్రభావం వంటి కారణాలతో కర్పూర రకం అరటి గెలలకు డిమాండ్ ఏర్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో వీటికి గరిష్ఠంగా రూ.600 వరకు ధర పలుకుతోంది.

కోనసీమలో రైతులు కొబ్బరి, వరి తర్వాత అరటిసాగు అధికంగా చేస్తుంటారు. అందులోను కర్పూర రకం ఎక్కువగా పండిస్తారు. ఈ రకాన్ని ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతులు చేస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చిన సమయంలో ధరలు అనుకూలంగా ఉంటాయి. మూడు నెలలుగా హెచ్చుతగ్గులుగా ఉన్న కర్పూర రకం అరటి ధరలు వారంరోజులుగా పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎగుమతులకు డిమాండ్ ఉండడంతో రోజురోజుకు ధరల పెరుగుదల కనిపిస్తోంది. ఒడిశాలో పౌర్ణమి రోజుతో కార్తీక మాసం ముగియడంతో అక్కడ కర్పూర రకం అరటిగెలలు వినియోగం బాగా పెరిగింది. దీంతో పూర్తిస్థాయిలో తయారైన గెలల నుంచి నాసిరకంలో ఉన్నవి సైతం వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతులు చేస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై గెలలు తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తుంటారు. కర్పూర రకం అరటిగెలలకు ఒడిశా ఎగుమతులకు డిమాండ్ పెరగడంతో మార్కెట్ యార్డుకు గెలలను అధికసంఖ్యలో రైతులు తీసుకువస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లు అరటి గెలలు వ్యాపారులతో కళకళలాడుతోంది. కొన్నిరోజులక్రితం కర్పూర రకం అరటి గెల రూ.150 నుంచి రూ.300 వరకూ మాత్రమే పలికింది. శనివారం అదే కర్పూర రకం అరటి గెల రూ.300 నుంచి నాణ్యమైన గెల రూ.650 వరకూ పలకుతుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో అరటి తోటలు గెల తయారీ దశలో కూడా నేలకొరిగాయి. దీంతో నాసిరకం గెలలు కూడా మార్కెట్‌కి వస్తుండగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు శనివారం 20వేల అరటిగెలలు రాగా అందులో 15వేల గెలలు కర్పూర రకం కాగా చక్రకేళీ, తెలుపు, బూసావళి, కూర అరటి రకాలు 5వేల వరకు ఉంటాయి. వ్యాపారులు ఒడిషా, భువనేశ్వర్, కటక్, విశాఖపట్నం, తెలంగాణాతోపాటు పలు ప్రాంతాలకు వీటిని ఎగుమతి చేస్తుండగా నిత్యం 75 శాతం గెలలు ఒడిశాకే ఎగుమతవుతున్నాయి.

ఉప్పునీటితో కొబ్బరి తోటల్లో సంక్షోభం

డాక్టర్ యర్రంశెట్టి పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ జర్నల్‌లో చోటు



ఎమ్మెల్యే వరప్రసాద్‌కు పరిశోధనా పత్రాన్ని చూపుతున్న సత్యప్రసాద్

మలికిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోదావరి డెల్టా వ్యవస్థలో అంతర్భాగమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లి ప్రాంతం ఉప్పునీటి ప్రభావంతో ఎదుర్కొంటున్న పర్యావరణ, సామాజిక, ఆర్థిక సంక్షోభంపై డాక్టర్ విజయసత్యప్రసాద్ యర్రంశెట్టి పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ జర్నల్‌లో చోటు దొరికింది. ఈ సందర్భంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు పరిశోధనా పత్రాన్ని అందించారు. కేశనపల్లి కొబ్బరి తోటలకు సమస్యకు మూల కారణం శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా ఉప్పునీరు ప్రవేశించడం, ఇది కేశనపల్లితో పాటు మరో తొమ్మిది గ్రామాల్లో కొబ్బరి, వరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించడంపై ఆయన పరిశోధన చేశారు. ఈ జర్నల్‌లో ప్రచురితమైన ప్రతులను ఎమ్మెల్యేకు అందించారు. ఉప్పునీరు లోపలికి వచ్చి సారవంతమైన వ్యవసాయ భూముల్లోకి చొచ్చుకుపోయి ఏర్పడిన జల సంబంధ దుర్భరత్వాన్ని వివరించారు. ఈ నష్టం బహుముఖంగా వినాశకరంగా ఉన్నట్టు నివేదించారు. కొబ్బరి వ్యవస్థ కుప్పకూలడం జీవనోపాధిని దెబ్బతీసిందని, గ్రామీణ కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని కలిగించిందని పరిశోధనలో వెల్లడించారు. సత్యప్రసాద్ పరిశోధనా పత్రాన్ని చేయడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ యెనుముల నాగు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



బోడసకుర్రు మీదుగా శబరిమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులు

అల్లవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు మాలధారణతో కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయం వరకు శనివారం పాదయాత్ర ప్రారంభించారు. పీఠాల వద్ద పూజలు చేసి అల్లవరం మండలం మొగళ్లమూరి నుంచి భజరంగదళ్ మండల ప్రముఖ్ అల్లు అజయ్‌స్వామి శబరిమలకు శనివారం పాదయాత్ర ప్రారంభించారు. ఉప్పలగుప్తం మండలం బట్టుపాలేనికి చెందిన పోలిశెట్టి తిరుమలరావు, మీసాల హరీష్, నాగులపల్లి సతీష్, ఉప్పలగుప్తానికి చెందిన బద్రి నారాయణస్వామిలతో కలిసి అల్లు అజయ్‌స్వామి యాత్ర చేపట్టారు. 41వ రోజున దీక్ష ముగిసే వరకు యాత్ర కొనసాగుతుంది. కేరళలోని పంబా నది వద్ద ఇరుముడులు కట్టుకుంటామని, రోజుకు 30 నుంచి 40 కిలోమీటర్ల వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పేరూరు వై-జంక్షన్ రామాలయం వద్ద అయ్యప్పభక్తులకు తెలుగు రైతు నాయకుడు ఆకుల లక్ష్మణరావు, యాళ్ల కాసుబాబు, వెంకటనారాయణ, ఈశ్వరరావు, అల్లు సత్తిబాబు, పిల్లా ప్రసాద్, కంకిపాటి సుబ్బారావు, కంకిపాటి గోపి స్వాగతం పలికారు.

యానాం నుంచి సైకిల్‌పై ..

యానాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గానికి చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు కేరళ రాష్ట్రంలోని శబరిమలకు సైకిళ్లపై పయనమయ్యారు. వీరికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి సుమ రూ.50 వేలతో సైకిళ్లను సమకూర్చారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం యానాం పెర్రిరోడ్డులోని దత్త మణికంఠస్వామి ఆలయంలో పూజల అనంతరం ఈ యాత్రను ఢిల్లీ ప్రతినిధి మల్లాడి సతీమణి ఉదయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యానాం ఓల్డేజ్ హోమ్ ప్రతినిధి పెసల గంగయ్య, మల్లాడి సత్తిబాబు, భీరస్వామి, కంచర్ల పెదబాబు, కొల్లు వీరబాబు, ఆకుల నాగేశ్వరరావు, భద్రం పాల్గొన్నారు.

కోనసీమ నుంచి కేరళకు పయనమైన ఐదుగురు అయ్యప్ప భక్తులు



యానాం నుంచి సైకిల్‌పై శబరిమల వెళ్తున్న భక్తులు

భక్తవత్సల.. గోవిందా

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం.. స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కార్తీక శనివారం ఏకాదశి కావడంతో భక్తజనం పోటెత్తారు. స్వామి వారికి ఆలయార్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిరువీధుల్లో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.62.53 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు బారులుదీరి దర్శించుకున్నారు.

18న రాజమహేంద్రవరానికి మంత్రి నారా లోకేశ్

టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే వాసు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 18న రాజమహేంద్రవరం రానున్నారని, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కొత్తగా నిర్మాణం పూర్తిచేసుకున్న పలు భవనాలకు ఆయన ప్రారంభోత్సవం చేస్తారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాలులో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో పీజీ సెట్-2025లో 1 నుంచి 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ అవార్డులు పొందిన వారు మరింత మందికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలన్నారు. నగరంలోని జేఎన్ రోడ్డులో ఆంధ్ర కేసరి పేరుతో ఉన్న కళాశాల జంక్షన్‌లో గత పాలకులు కప్పు సాసర్ ఏర్పాటు చేయడం దారుణమని, తాను త్వరలో అక్కడే 6 అడుగుల ఆంధ్ర కేసరి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్, ప్రతినిధులు సుధాకర్, బార్గవ్, విజయలక్ష్మీ, వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం హామీని విస్మరించిన సీఎం

చినశంకర్లపూడిలో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ విమర్శ



చినశంర్లపూడిలో పర్యటిస్తున్న రామచంద్రయాదవ్

ప్రత్తిపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఎన్నికల్లో బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామన్న హామీని విస్మరించారని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బొడే రామచంద్రయాదవ్ విమర్శించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక బీసీ సంఘర్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నూటి కి 50-55శాతం బీసీలు ఉన్నా సీఎం చంద్రబాబు బీసీల రక్షణకు అధికా రం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.గత ప్ర భుత్వంలో జరిగిన అరాచకాలు కంటే 10రెట్లు అరాచకాలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీలను అణచివేయడంలో వైసీపీ, టీడీపీలు పోటీ పడుతున్నాయని, ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి చెప్పేలా ప్రజలు ముందుకు రావాలని కోరారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలు ఘన విజయం సాధించాలని, ఇందుకు బీసీల నియోజకవర్గం ప్రత్తిపాడునుంచే ఇది ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ బీసీ నేతలు ఏపూరి శ్రీను, గొంప శివకుమార్, లాయర్ శ్రీనివాసరావు, ఏపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

శాటిలైట్ ఇమేజ్ వెరిఫికేషన్‌తో పంట నష్టం అంచనా

రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా రాయవరం మండలం ఎంపిక



రాయవరంలో సమావేశమైన పంటనష్టం అంచనాబృందం

రాయవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టం వివరాలను శాటిలైట్ ఇమేజ్ వెరిఫికేషన్ ద్వారా నమోదు చేసేందుకు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బాపట్ల, పల్నాడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాయవరం మండలాన్ని ఎంపిక చేసినట్టు వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంటనష్టం నమోదు(మాన్యువల్) వివరాలను శాటిలైట్ వెరిఫికేషన్(డిజిటల్) వివరాలతో సరిపోల్చేందుకు ఒక ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. మండలంలోని వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి గ్రామాల్లో పంటనష్టం వివరాలను డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా నమోదు చేస్తారన్నారు. మండలంలోని పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఆలమూరు ఏడీఏ కేవీ చౌదరి ఆధ్వర్యంలో అధికారులు పర్యటించారన్నారు. గ్రామస్థాయిలో నమోదు చేసిన వివరాలను మండలాధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ జరిపారని చెప్పారు.

భక్తులతో కిక్కిరిసిన భీమేశ్వరాలయం



భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరిదేవి

సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా శనివారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామున ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, మండలి సభ్యుల పర్యవేక్షణలో పండితులు వేదమంత్రోచ్చారణ మధ్య స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, బాలాత్రిపుర సుందరిదేవికి పుష్పార్చన నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి,అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలు, సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీప పూజలు, రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన, సంఘం సభ్యులతో జ్యోతిర్లింగార్చన పూజలు నిర్వహించారు. ఆలయ నిత్యాన్నదాన పథకంలో సుమారు 1,200 మంది భక్తులు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు దంపతులు, చిత్తూరు జిల్లా ఆర్జేసీ, కాణిపాకం వినాయకస్వామి ఆలయ ఈవో కిశోర్ దంప తులు భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగదు ప్రోత్సాహక పథకం కింద అర్హులైన వారికి పారితోషకం అందించనున్నట్టు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ప్రకటించింది. దీంతో అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి.సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం గర్వించేలా పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఈ నెల 4వ తేదీ రాత్రి 11.59 గంటలకు లోపు దరఖాస్తులను sports.ap.gov.in/registration లింకు ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

సత్యదేవుడి సన్నిధి.. విపరీతమైన రద్దీ

● ఆలయానికి పోటెత్తిన భక్తులు
● 8200 వ్రతాలు
● రూ.70 లక్షల ఆదాయం



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధి శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అశేష భక్తజనంతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటి గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎక్కడా తోపులాటలకు ఆస్కారం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో అసౌకర్యం కలగలేదు. రద్దీకి అనుగుణంగా అంత్రాలయ దర్శనాలను అనుమతించారు. విపరీతమైన రద్దీ సమయంలో అంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి అనుమతించారు. కొద్దిసేపు యంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దేవస్థానం చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్‌వద్ద దళారులకు అవకాశం లేకుండా పర్యవేక్షించారు. వాహనాలన్నీ సత్యగిరి కొండపైకి మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య రాకుండా చూశారు. స్వామివారి ఉచిత దర్శనానికి 3గంటలు, ప్రత్యేక దర్శనానికి 2గంటల సమయం భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. శనివారం ఒక్కరోజు 8,200 జంటలు స్వామివారి వ్రతమాచరించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.70లక్షల ఆదాయం లభించింది. ఈవో సుబ్బారావు వ్రత మండపాలు, క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిచ్చారు.

రూ.1.80 లక్షల విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన రామ్ మాణిక్యం శనివారం రూ.1.80 లక్షలు విరాళం చైర్మన్ ఐవీ రోహిత్‌కు అందజేశారు. ఆయన దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. పీఆర్వో అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత

నేడు సత్యదేవుడి తెప్పోత్సవం

సాయంత్రం 5.45కి తులసి ధాత్రి పూజ, రాత్రి 7గంటలకు నౌకావిహారం


అన్నవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి ప్రతిఏటా నిర్వహించే కీలకమైన ఉత్సవాల్లో ఒక్కటైన తెప్పోత్సవానికి ఆలయ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆదివారం రాత్రి 7గంటలకు స్వామి,అమ్మవార్లు పంపా సరోవరంలో నౌకావిహారయాత్ర చేయనున్నారు. ఇప్పటికే రంగురంగుల విద్యుద్దీపఅలంకరణలు ఏర్పాటు చేశారు. వేలాదిగా భక్తులు తిలకించేందుకు వీలుగా ప్రత్యేక వేదికను తీర్చిదిద్దారు. ప్రముఖులు వీక్షించేందుకు ప్రత్యేక వీఐపీ గ్యాలరీ, ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. స్వామి,అమ్మవార్లను ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు కొండపై నుంచి మేళతాళాలతో పల్లకీలో పంపా సరోవర తీరం వద్దకు తీసుకువస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించి అలంకరణ అనంతరం 5.45 గంటలకు తులసిధాత్రి పూజను నిర్వహించి 7గంటలకు నౌకావిహార యాత్రను నిర్వహిస్తారు. పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో 100మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్యదేవుడి తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం

ఘనంగా పెద్ద ఏనుగుల సంబరం

కరప, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో శనివారం రాత్రి పెద్ద ఏనుగుల సంబరం ఘనంగా జరిగింది. నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో చిన్న ఏనుగుల సంబరాన్ని నిర్వహించారు. మెర్ల, మార్ని వంశస్థుల సంబరంగా పేర్కొనే ఈ ఉత్సవంలో ఏనుగు ప్రతిమలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రత్యేక వాహనాలపై ఈ ఏనుగులను గ్రామంలో రాత్రి తెల్లవార్లు ఊరేగించారు. వివిధ రకాల సజ్జలు, భారీ బాణసంచా కాల్పులతో నిర్వాహకులు సంబరాన్ని రక్తికట్టించారు. తెల్లవారుజామున ఎదురెదురుగా ఏనుగులను ఉంచి కనులపండువగా ఉత్సవాన్ని జరిపారు. ఈ సంబరాన్ని వీక్షించేందుకు వేలాది మంది తరలిరాగా ఏ అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే పెనుగుదురులో శనివారం రాత్రి వెంకన్నబాబు సంబరం ఘనంగా జరిగింది. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ నేతలు పిల్లి సత్తిబాబు, కటకంశెట్టి బాబి సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యుత్ అలంకరణతో ముస్తాబైన మెర్ల వారి ఏనుగు ప్రతిమ

'డైట్'లో ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పెంపు

కాకినాడ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పాఠశాల విద్యా సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) నందు డిప్యూటేషన్ పద్ధతిలో 2025-26కు గాను అర్హులైన పాఠశాల సహాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గడువును ఈనెల 3వరకూ పొడిగించామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైలు ఢీకొని 30 గొర్రెలు మృతి



గొల్లప్రోలులో మరణించిన గొర్రెలు

గొల్లప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద శనివారం సాయంత్రం రైలు ఢీకొని 30కిపైగా గొర్రెలు మృతి చెందగా, మరో 12 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. సుద్దగడ్డ, ఏలేరు వరద నీరు ప్రవహిస్తుండడంతో బ్రిడ్జి కింద నుంచి వెళ్ల లేక గొల్లప్రోలుకు చెందిన గొర్రెల వెంకటరమణ తన గొర్రెలను రైల్వేట్రాక్ మీదుగా పొలంలో మేసేందుకు తీసుకెళ్తున్నాడు. అదే సమయంలో 2 ట్రాక్‌లపై ఒకే సమయంలో రైళ్లు రావడంతో బెదిరిపోయాయి. విజయవాడ వైపు నుంచి విశాఖపట్టణం వైపు వెళ్తున్న రైలు గొర్రెలను ఢీకొనడంతో 30 అక్కడికక్కడే మరణించాయి. మిగిలినవి గాయపడ్డాయి. ఈ ప్రమాదం కారణంగా రూ.7లక్షలు నష్టపోయాయని గొర్రెల వెంకటరమణ ఆవేదనచెందాడు.

అత్యాచార నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం

నిందితుడిపై గతంలో నోట్లమార్పిడి, బైక్ చోరీ కేసులు : అమలాపురం డీఎస్పీ

ఐ.పోలవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాణాపురం అత్యాచార నిందితుడు రాయపురెడ్డి సత్యవెంకటకృష్ణ(బాబి)(45)పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రవృత్తి కలిగిన వ్యక్తులను జైలుకు పంపించి కఠినంగా శిక్షించవలసిన అవసరం ఉందన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నిందితుడు నేర చరిత్ర కల్గిన వ్యక్తిగా పేర్కొన్నారు. నిందితుడిపై పోక్సో చట్టం 2012 ప్రకారం 2సెక్షన్లపై కేసు నమోదు చేశామన్నారు. బాధితురాలి బంధువులను విచారించామన్నారు. బాధితురాలితో కలిసి స్వయంగా నిందితుడి ఇల్లు, నిర్మాణంలో ఉన్న అతడి సోదరుని ఇల్లు పరిశీలించామన్నారు. బాధితురాలి వివరాల ప్రకారం సెప్టెంబరులో ఆరుసార్లు అత్యాచారం జరిగినట్టు గుర్తించామన్నారు. నిందితుడు వెంకటకృష్ణను అరెస్టు చేసి ముమ్మిడివరం కోర్టుకు తరలించామన్నారు. నిందితుడు ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్ విద్యాకమిటీ కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నాడన్నారు. వాలీబాల్ క్రీడలో నైపుణ్యం కల్గిన నిందితుడు స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు శిక్షకుడిగా పనిచేసేవాడన్నారు. 2001లో నిందితుడిపై ఐ.పోలవరం స్టేషన్‌లో బైక్ చోరీ, 2005లో రాజానగరంలో దొంగ నోట్లు మార్పిడి కేసు నమోదైనట్టు తెలిపారు. సమావేశంలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్,ఎస్ఐ రవీంద్రబాబు ఉన్నారు.

రేపటి నుంచి డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ తరగతులు

సామర్లకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవో సుమారు 200 మందికి ఈనెల 3 నుంచి 13 వరకూ శిక్షణ తరగతులు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రసాదరావు వెల్లడించారు.

దురలవాట్లకు లోనై...

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

24 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్ట్ చేసిన సర్పవరం పోలీసులు

సర్పవరం జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఖాళీ భవనం వద్ద పోలీసులు ఆకస్మిక దాడి చేసి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇందులో ఇద్దరు మైనర్లు ఉండటం గమనార్హం. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, సీఐ పెద్దిరాజు పర్యవేక్షణలో ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ సిబ్బందితో కలసి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డిప్యూటీ తహశీల్దార్ సమక్షంలో ఏపీఐఐసీ ఖాళీ భవనంపై దాడులు నిర్వహించారు. అక్కడ కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఐశ్వర్యాంబిక ఆలయం సమీపానికి చెందిన 20 ఏళ్ల బులిపే అజయ్‌కుమార్ (అజయ్), ఇంద్రపాలెనికి చెందిన 19 ఏళ్ల అనపర్తి శివశంకర్ (గోంగలి), సీసీఎల్-1 17ఏళ్ల పెంకే వెంకట సత్యవరప్రసాద్ (ప్రసాద్), 17 ఏళ్ల కోరిమిల్లి సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నలుగురి వద్ద తలో 6 కిలోలు వెరసి 24 కిలోలు (రూ.1.20 లక్షలు) విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెపారు. వీరంతా స్నేహితులని.. గంజాయి, సిగరెట్, మద్యం వంటి దురలవాట్లకు లోనై సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణా బాట పట్టారన్నారు. వీరు నర్సీపట్నం సమీపంలో గల ఏజెన్సీ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.2 వేలుకు కొనుగోలు చేసి కాకినాడకు తీసుకువచ్చి విక్రయించి లాభాలు పొందాలనుకున్నారని తెలిపారు. నిందితుల్లో ఏ1,ఏ2 ఇద్దరిపై పూర్వ నేరచరిత్ర ఉందని, అజయ్ కుమార్ సామర్లకోట పీఎస్‌లో నిందితుడని, శివశంకర్ పలు కేసుల్లో నిందితుడన్నారు. మిగతా ఇద్దరు మైనర్లను రాజమహేంద్రవరం జువైనల్ జస్టిస్ బోర్డుకు తరలించడం జరిగిందన్నారు. ఏ1, ఏ2 నిందితులను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడకం, గంజాయి రవాణా, మత్తు పదార్థాల వ్యాపారం జరిగితే 112, 100కు సమాచారం అందించాలని కోరారు.

ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటుండగా...

యువకుడిపై కత్తితో దాడి

అక్కడికక్కడే మృతి



మృతిచెందిన బాబ్జి

గండేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యర్రంపాలెంలో శుక్రవారం రాత్రి క్షణికావేశంలో ఓ వ్యక్తి యువకుడిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యర్రంపాలెంలో కాకర చిన్ని అనే వ్యక్తి కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్నాడు. అక్కడే గ్రామానికి చెందిన బొంగా బాబ్జి (17) అనే యువకుడు రాత్రి 11గంటల సమయంలో ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటున్నాడు. గమనించిన చిన్ని అక్కడి నుంచి వె ళ్లిపోవాలని బాబ్జికి చెప్పాడు. అయినా వినకుండా బాబ్జి అక్కడే ఉండడంతో ఇద్దరి మధ్య మాటామా టా పెరిగింది. దీంతో ఆవేశంలో బాబ్జి పీక మీద చిన్ని కత్తితో దాడి చేయడంతో వెంటనే అతడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందు కున్న గండేపల్లి ఎస్ఐ యువీ శివనాగ బాబు, డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీనిపై గండేపల్లి ఎస్ఐ కేసు నమోదు చేయగా సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో పరిహారాలు చెల్లిస్తాం..

● రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
● వేలేరుపాడులో పోలవరం నిర్వాసితులకు చెక్కుల అందజేత



సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, తదితరులు

వేలేరుపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న ప్రతీ ఒక్క నిర్వాసితుడికి పూర్తిస్థాయి పరిహారాలు ఇళ్ల నిర్మాణాలు చేసి అందించి వారిని సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం భూసేకరణ, పునరావాసం నిర్వాసితుల సభ, పరిహారాల చెక్కులు అందించే కార్యక్రమాన్ని వేలేరుపాడు జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం జరపగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొన్ని కారణాల కారణంగా పరిహారాల చెల్లింపులో అవరోధాలు ఏర్పడితే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేస్తామని పరిహారం రాని ఏ ఒక్కరు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆహర్నిశలు పనిచేస్తున్నారని వారికి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. అనంతరం నిర్వాసితులకు చెక్కుల పంపిణీ చేశారు.నిర్వాసితులను ఆదుకుంటున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులను జగన్ మోసం చేస్తే, కూటమి ప్రభు త్వం నిధులు విడుదల చేసి పరిహారాలు జమ చేస్తూ నిర్వాసితుల కళ్లల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి, పోలవరం అడ్మిని స్ట్రేటర్ అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ, ఆర్డీవో రమణ, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల టీడీపీ అధ్యక్షులు అమరవరపు అశోక్, ములిశెట్టి నాగు, తదితరులు పాల్గొన్నారు.

రామారావు ఖాతాలో నగదు జమ

కూనవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు శనివారం నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. మండలంలో మొత్తం తొమ్మిది ప్రాధాన్యత గ్రామాలను గుర్తించారు. ఇందులో కూనవరం, టేకులబోరు, కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, టేకుబాకా, కూళ్లపాడు, పెద్ద ఆర్కూర్, పంద్రాజుపల్లి, వాల్‌ఫర్‌పేట గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అందులో భాగంగానే మండలంలో తొలి ఖాతాదారుడు మొట్టం రామారావు ఖాతాలో రూ.6,65,138 లక్షలు జమయ్యాయి. దీంతో నిర్వాసితులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



శివమణి

ఎటపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ - 17 వాలీబాల్ పోటీలకు అల్లూరి జిల్లా ఎటపాక మండలం కేఎస్‌పురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. పదోతరగతి చదువుతున్న అపకా శివమణి కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం నుంచి సోమవారం వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శివమణి పాల్గొంటాడు. ఈ సందర్భంగా శంకరయ్య, పీడీ కన్నారావు అభినందించారు.

ఉరి పోసుకుని వ్యక్తి ఆత్మహత్య




మృతిచెందిన దొంతంశెట్టి అనిల్‌కుమార్ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఇంట్లో ఉరిపోసుకుని ఓ వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన దొంతంశెట్టి అనిల్‌కుమార్ (28) శనివారం ఇంట్లో చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన రాడ్ బైండింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా మద్యానికి బానిసై ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. తరచూ కడుపునొప్పి రావడంతో ఇటీవల ఆసుపత్రిలో చూపించాడు. గత కొంతకాలంగా ఆరికిరేవులలో భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం కొవ్వూరు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మృతుడి సోదరుడు సతీష్‌కుమార్ శనివారం ఉదయం కొవ్వూరు క్రిస్టియన్‌పేటలోని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి పోసుకుని మృతిచెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

రైతుల్లో మళ్లీ గోదా'వర్రీ'

● భద్రాచలం వద్ద 29 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
● లంక ప్రాంతాల్లో మిర్చిపంటపై తీవ్ర ప్రభావంతో ఆందోళన

ఎటపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వరుసగా తుపాన్లు రావడంతో సాగు చేస్తున్న పంటలు పాడైపోతున్నాయని వారంతా ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా విలీన మండలాల రైతులు నిండామునిగారు. అప్పులు చేసి ఇటీవల మిర్చి, పొగాకు పంటలు సాగు చేశారు. ఈక్రమంలో ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ ప్రభావంతో ఆ పంటలన్నీ నీటమునిగాయి. అంతేకాకుండా గోదావరికి మళ్లీ వరద నీరు పోటెత్తింది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి శనివారం సాయంత్రం 29 అడుగుల నీటిమట్టం నమోదైంది. అయితే ఈ సమయంలో భద్రాచలం వద్ద 40 అడుగుల మేర నమోదైతే లంక ప్రాంతాల్లో సాగైన మిర్చి తోటలన్నీ పూర్తిగా ముంపు బారిన పడనున్నాయి.



తోటపల్లి వాగులో పెరుగుతున్న నీరు

గతంలో నవంబరు నెలలో ఎప్పుడూ వరదలు చూడలేదని రైతులు చెబుతున్నారు. వరద 40 అడుగుల మేర పెరిగితే ఒక్కో రైతుకు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల మేర నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి.

● దేవిపట్నంలోనూ అదే పరిస్థితి

దేవీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ ప్రభావంతో గోదావరికి వరద నీరు చేరింది. ముంపు పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, మంటూరు, తాళ్లూరు, నడిపూడి, పూడిపల్లి, అగ్రహారం, తదితర గ్రామాల్లోకి నీరు చేరుకుంది. మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయాన్ని గోదావరి చుట్టుముట్టింది. దీంతో పాపికొండలు పర్యాటకాన్ని అధికారులు నిలుపుదల చేశారు.

● తాత్కాలికంగా అమ్మవారి దర్శనం నిలుపుదల

గొందూరులో వేంచేసియున్న మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ ప్రకటించే వరకు ఎవరూ రావొద్దని సూచించారు.

పెద్దసీతనపల్లిలో పాఠశాల గేటుకు తాళం

● స్వీపర్ పోస్టు కోసం ఇరు వర్గాల మధ్య రగడ ● రంగంలోకి దిగిన పోలీసులు

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దసీతనపల్లి ఎంపీపీ పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టే (స్వీపర్) పోస్టు కోసం కొద్ది రోజులుగా ఆ గ్రామంలోని ఇరు పక్షాల నడుమ పోటీ నెలకొంది. చివరకు ఈ పోటీ వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆ పాఠశాల భవన నిర్మాణానికి భూమి దానం చేసిన సుబ్బారావు పాఠశాల గేట్‌కు తాళం వేశాడు. దీంతో చేసేదేమి లేక ఉపాధ్యాయులు రచ్చబండ వద్ద బోధన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న చింతూరు ఎస్ఐ రమేష్ పాఠశాల వద్దకు తమ సిబ్బందిని పంపించి గేట్ తాళం తీయించి విద్యార్థులను తిరిగి పాఠశాలకు తరలించారు. తదుపరి గ్రామంలో ఎటువంటి వివాదం చోటుచేసుకోకుండా సాయంత్రం వరకు అక్కడే పోలీసులను రక్షణగా ఉంచారు. 2021 నుంచి ఇప్పటి వరకు నడుమ రెండు నెలలు మినహా అదే గ్రామానికి చెందిన శైలజ పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తాజాగా తిరిగి శైలజనే స్వీపర్‌గా కొనసాగిస్తూ పాఠశాల నిర్వహణ కమిటీ తీర్మానం కూడా చేసేసింది. ఇదిలా ఉండగా పాఠశాల భవన నిర్మాణం కోసం తమ కుటుంబం భూమి దానం చేసినందున తమ కుటుంబానికి చెందిన మహిళనే స్వీపర్‌గా నియమించాలని భూదాత సుబ్బారావు కుటుంబం పట్టుపట్టింది. కాగా శైలజనే స్వీపర్‌గా కొనసాగిస్తుండడంతో సుబ్బారావు కుటుంబం ఆగ్రహించింది. ఈ క్రమంలో తమ కుటుంబానికి అన్యాయం జరిగిందన్న నిరసనను వ్యక్తం చేస్తూ పాఠశాల గేట్‌కు తాళం వేయడం జరిగింది. విషయం పోలీసులకు చేరడంతో ఇరు పక్షాల నడుమ సర్ది చెప్పారు. అదే క్రమంలో సమస్యను సామరస్యంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంఈఓలకు పోలీసులు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఎస్ఐ రమేష్ ధ్రువీకరించారు.



పాఠశాల గేట్‌కు తాళాలు వేసిన భూ దాత

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● గోకవరం మండలం కొత్తపల్లిలో ఘటన
● బోరున విలపిస్తున్న కుటుంబీకులు

గోకవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలీసులు కథనం ప్రకారం.. గంగవరం మండలం జడేరుకు చెందిన షేక్ సాయిబాబా (50) గోకవరంలో నివాసం ఉంటున్న అల్లుడు వద్దకు వచ్చాడు. ఆ తరువాత స్వగ్రామం జడేరు చేరుకునేందుకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అడ్డతీగల వెళ్లే బస్సు ఎక్కాడు. ఈక్రమంలో బస్సు గోకవరం నుంచి బయలుదేరి కొత్తపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలపగా, సాయిబాబా బస్సు దిగాడు. తిరిగి బస్సు ఎక్కే క్రమంలో కిందకు జారిపోవడంతో అతినిపై నుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్తా కొంతమేర ఊడ్చుకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమై సాయిబాబా అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిబాబాకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు ...

గోకవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై శనివారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కామిశెట్టి పుష్పభగవాన్(22) శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న పోలవరం కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. జరిగిన సంఘటనపై అందిన పిర్యాదు మేరకు అనుమానస్పదమృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమలాపురం

పంటకాల్వల్లో చెట్ల తొలగింపుపై
కలెక్టర్‌కు వివరించాం

● సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్



పంటకాల్వలో విరిగిపడిన చెట్లను పరిశీలిస్తున్న సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రధాన పంటకాల్వల వెంబడి ఉన్న భారీ వృక్షాలు సాగునీరుకు అడ్డంకిగా మారాయని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ తెలిపారు. పి.గన్నవరం ప్రధాన పంట కాల్వలో విరిగిపడిన చెట్లను ఈఈ వెంకటేశ్వ రావు, స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించి అనంతరం మాట్లాడారు. చెట్లు తొలగింపు ప్రక్రియ భారీ వ్యయంతో కూడుకు న్న పని అని ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈఈ వెంకటేశ్వ రావు మాట్లాడుతూ అమలాపురం, పి.గన్నవరం సబ్‌డివిజన్‌ల పరిధిలో తుఫాన్ కారణంగా భారీ వృక్షాలు పంట కాల్వలో విరిగిపడ్డాయని చెప్పారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కొంతమేర నిధులు కేటాయించారని ఆనిధులు క్షేత్రస్థాయిలో సరిపోయే పరిస్థితి లేదని నీటిసంఘాల ప్రతినిధులు మాదృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పి.గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలో సుమారుగా 50 చెట్లుపైగా పంటకాల్వల్లో విరిగిపడ్డాయని చెప్పారు. వీటికి సంబంధించి ప్రతి సాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని ఈఈ స్పష్టం చేశారు. విద్యుత్ సిబ్బంది అత్యవసర పనులు నిమిత్తం కాల్వ వెంబడి తొలగించే చెట్లను కాల్వల్లో వేయడంతో సాగునీరుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రాజెక్టు చైర్మన్ వెంట ఏఈఈ రమేష్‌బాబు, ప్రాజెక్టు వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఇసుకపూడి నీటిసంఘం అధ్యక్షులు కె.సత్యనారాయణరాజు, మామిడిశెట్టి నాగ రాజు, జవ్వాది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'బాల్య వివాహాలను నిరోధించాలి'



బాల్య వివాహాల నిర్మూలనపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటువంటి బాల్య వివాహాలు జరుగకుండా బాల్య వివాహాలపై కఠినమైన నిఘా ఉంచాలని అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి వైఎల్ జయరాజు పేర్కొన్నారు. అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు, ర్యాలీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గత జూన్ నెల నుంచి జిల్లాలోని బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువస్తామన్నారు. నవంబరు 1 నుంచి వంద రోజుల పాటు పాఠశాలలు, దేవాలయాలు, మసీదు, చర్చిల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు గురించి సమాచారం తెలిస్తే పోలీసు హెల్ప్‌లైన్ 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 స్థానిక పోలీసుస్టేషన్‌లో బాలల పరిరక్షణ కమిటీకి తెలియజేయాలన్నారు. అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ పిల్లల రక్షణ, వారి హక్కుల కోసం దేశవ్యాప్తంగా పనిచేస్తుందన్నారు. మహిళా, శిశు అభివృద్ధిశాఖ బాల్ వివాహ్ ముక్తి భారత్ ప్రచారానికి అనుగుణంగా జిల్లాలో బాల్య వివాహాలు అంతమొందించడానికి కృషి చేస్తుందన్నారు. జిల్లాను బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్ కర్నిడి వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఆర్.తులసి, కె.సరిత పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు
సీఎం చంద్రబాబుచే సన్మానం

● ఆర్డీవో మాధవికి జ్ఞాపిక అందించిన సీఎం

అమలాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు చేసిన సేవలు ప్రశంసనీయమని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. అమరావతిలోని తన స్వగృహంవద్ద శనివారం తుఫాన్ సమయంలో సేవలు అందించిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌బాలయోగిలను సన్మానించి మెమెంటోతోపాటు ప్రశంసాపత్రాన్ని చంద్రబాబువారికి అందజేశారు. వారి సేవలను కొనియాడారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన ముందస్తు చర్యలకు అధికారులను సమన్వయం చేయడం, పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితులకు సేవలు చేయడం, ఎమ్మెల్యేలతో కలిసి చురుగ్గా వ్యవహరించడంలో కీలకంగా పనిచేసిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్‌కృషిని చంద్రబాబు అభినందించారు. బాధితులకు ధైర్యం చెప్పి భరోసా ఇవ్వడంలో కృషిచేసిన వీరికి ప్రత్యేక మెమెంటో అందించి సత్కరించారు.

ఆర్డీవోకు ప్రశంసలు

తుఫాన్ విపత్కర పరిస్థితుల్లో ముంపు బాధితులకు అంగడా నిలిచిన అమలాపురం ఆర్డీవో కె.మాధవికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ప్రత్యేక జ్ఞాపికను అందించి శాలువతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని ఆమెకు అందించారు.

శ్రీనివాసరావుకు అవార్డు



ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో ప్రజలకు దగ్గరగా ఉంటూ సకాలంలో సహాయక సేవలు అందించినందుకుగాను ముమ్మిడివరం పంచాయతీరాజ్ డీఈఈ పాలకొల్లు విజయ శ్రీనివాసరావుకు ఉత్తమ సేవాఅవార్డును అందించారు.

జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకలు

కాట్రేనికోన, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన చెంచులగరువులో శనివారం జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి నాగశిరీష తమ శాఖ ద్వారా గిరిజన సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. గిరిజనుల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమ పిల్లలను గిరిజనులు పాఠశాలలకు పంపించాలన్నారు. విద్య ద్వారా పేదరికం నుంచి బయటపడవచ్చన్నారు. ఎస్టీలు కానివారు కూడా ఎస్టీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో ఎస్వీ చలం, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, ఎంపీటీసీ మోకా చంద్రనాగరత్నం, హౌసింగ్ ఏఈ వేణు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరాజు, ఎంఈవోలు నామాల కృష్ణమోహన్, ఎం.వెంకటరమణ, ఎఫ్‌డీవో చలపతి, పంచాయతీ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ, ఎస్టీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవింద్, కె.ప్రసాద్, కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ, పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



ముమ్మిడివరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలస్థాయిలో రాజ్యాంగంపై నిర్వహించే వివిధ పోటీల్లో మండలస్థాయిలో 2వ స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థికి బహుమతిని అందించి అభినందించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు బహుమతిని అందించి అభినందించారు. కొమానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓలేటి మహేంద్ర రాజ్యాంగంపై నిర్వహించిన పోటీల్లో మండలస్థాయిలో రెండోస్థానం సాధించాడు. దీంతో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, రెడ్డి నాగార్జున, ఎస్.రాంబాబు, ఎస్ఎస్ మునేశ్వరరావు తదితరులు విద్యార్థి లోలేటి మహేంద్రను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన అండర్-14, 17 బ్యాడ్మింటన్ డివిజన్‌స్థాయి పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభచాటి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం కాశి ఘన సత్యనారాయణ తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో ప్రతిభ చాటిన 8వ తరగతి విద్యార్థిని మేడిచర్ల రిత్విక, పదో తరగతి విద్యార్థి కోటం దినేష్ ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉపాధ్యాయులు బీఎన్ వెంకటేశ్వరరావు ఆర్.శ్రీనివాసరావు, ఎం.చంద్రమోహన్, బి.రామకృష్ణ, కేఆర్ఎన్ ప్రసాద్, కేవీవీ సత్యనారాయణ, మట్టపర్తి శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

'బస్టాండ్ పునఃప్రారంభానికి చర్యలు'

ముమ్మిడివరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం డిపో మేనేజర్ డీఎల్ఎన్ శర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం బస్టాండ్‌ను ప్రారంభించాలని, బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిపో మేనేజర్ డీఎల్ఎన్‌శర్మ శనివారం బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండులో ప్రయాణికులకు అవసరమైన సదుపాయాల ఏర్పాటు, బస్సుల రాకపోకలకు అవసరమైన రోడ్డు, బస్టాండు భవనం అభివృద్ధి పనులు చేపట్టి, త్వరలోనే ప్రయాణికులకు బస్టాండు అందుబాటులోకి తీసుకువస్తామని డీఎం పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్టీసీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న అమలాపురం డీఎం శర్మ

ఘనంగా పుదుచ్చేరి విమోచన దినోత్సవం





జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్ఏ అంకితీకుమార్, చిన్నారుల నృత్య ప్రదర్శన

యానాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం పుదుచ్చేరి విమోచన దినత్సోవాన్ని(లిబరేషన్‌డే)ఘనంగా నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో యానాం పాలనాయంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసులు, విద్యార్థుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎస్పీ వరదరాజన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతికపోతాలను, మువ్వన్నెల బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. అనంతరం పోలీసులు, ఐఆర్‌బీ, హోంగార్డు, విద్యార్థులు కవాతు నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లంకలగన్నవరంలో వాటర్‌పైపులైన్ పనులు ప్రారంభం

పి.గన్నవరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): లంకల గన్నవరంలో జలజీవన్‌మిషన్‌లో భాగంగా పైపులైన్ పనులకు ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా వాటర్‌ట్యాంకులకు అనసంధానంగా ఈపైపులు ఏర్పాటు చేస్తున్నారని పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందుతుందని చెప్పారు. ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, మాజీ సర్పంచ్ కొపనాతి సీతారామస్వామి, మాజీ ఎంపీటీసీ పైడి బుజ్జి, గనిశెట్టి ఈశ్వర్, చిట్టాల జోగేశ్వరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మామిడికుదురు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీప్తి స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ సూచించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం కార్యక్రమంలో భాగంగా దీప్తి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కొమరాడ గ్రామంలోని స్లమ్ ఏరియాల్లో బ్లీచింగ్ చల్లి పరిసరాల పరిశుభ్రంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగమణి, డి.రమేష్, ప్రోగ్రాం అధికారులు పి.సుబ్బారావు, వి.కొండలరావు, ఎ.ఈశ్వరరావు, వి.నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజీని సందర్శించిన ముక్తేశ్వరం జడ్పీ విద్యార్థులు

అయినవిల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక సందర్శనలో భాగంగా ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశ్రామిక సందర్శనలో భాగంగా శనివారం అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజీని సందర్శించారు.

రోటరీ యూత్ ఫెస్టివల్ ప్రారంభం

అమలాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం రోటర్లీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీఏటా సాంప్రదాయంగా నిర్వహించే రోటరీ యూత్ ఫెస్టివల్ 2025ను శనివారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విభిన్న సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలతో వీటిని నిర్వహించనున్నారు. యువతలో నాయకత్వం, సేవాభావం, సామాజిక చైతన్యం, సృజనాత్మక ప్రతిభను వెలికి తీయడమే రోటరీ ఉత్సవాల ప్రధాన లక్ష్యం. ఈ ఉత్సవాల్లో విద్యార్థులు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని రోటరీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అమలాపురం రోటరీ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్, కార్యదర్శి ఆకొండి పవన్, ఈ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

యానాం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ చమురుసంస్థ తక్షణమే మాసమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని నిరాహారదీక్ష చేస్తున్న ఆందోళనకారులు హెచ్చరించారు. యానాం శివారు ప్రాంతమైన దరియాలతిప్ప ఐలాండ్ నెంబరు 3 సమీపంలో ఆగస్టు22 అర్ధరాత్రి ఓఎన్జీసీ గ్యాస్‌పైపులైను లీక్ అవ్వడంతో ఆయాప్రాంతాల ప్రజలందరూ భయాందోళనకు గురయ్యారు. అదేవిధంగా గోదావరిలోని జల సంపద పూర్తిగా నశించిపోవడం తదితర అంశాలపై పరిహారం కోసం ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శనివారంలో 19వ రోజుకు చేరింది. అనంతరం చమురు సంస్థల కార్యకలాపాలను అడ్డుకున్నారు. మాజీ మున్సిల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు తిరుకోటి నాగేశ్వరరావు, మెల్లం చిన్నా, మోకా బుజ్జి, వెంకట్రావు, అప్పారావు పాల్గొన్నారు.

అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం

రాజోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల మహిళా సమైక్య కార్యాలయంలో అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం రాజోలు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం జిల్లాస్థాయి వయోజన విద్య నోడల్ ఆఫీసర్ హాజరై సంక్షిప్త వాచకం గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు, టీచర్లకు వియోజన విద్య నోడల్ అధికారి సంక్షిప్త వాచకం గురించి వివరించారు. అనంతరం పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజోలు ఏపీఎం వర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పరంజ్యోతి విద్యార్థుల ప్రతిభ

అమలాపురంరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సిల్వర్ వోక్ ఇంటర్నేషనల్ స్కూలు ఆధ్వర్యంలో దక్షిణాసియాస్థాయిలో వెస్ట్-2025 క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కామనగరువు పరంజ్యోతి స్కూలు విద్యార్థులు వై.విష్ణునరేన్, ఎన్.నిషాంత్, నిరంజన్, అనూహ్య, ప్రావృశ్రీ, కె.ప్రణీత్, యు.లక్ష్మి, బి.ప్రణయ్ జూనియర్ విభాగంలో జాతీయస్థాయిలో ప్రతిభచాటి పతకాలు, సర్టిఫెట్లను దక్కించుకున్నారు. వీరిని శనివారం జరిగిన ప్రిన్సిపాల్ డాక్టర్ విల్‌ఫ్రెడ్, కరస్పాండెంట్ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి తదితరులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణఇచ్చిన మౌళి చంద్ర, లక్ష్మీదుర్గ, ప్రీతిలను అభినందించి సత్కరించారు.

బాలబాలాజీస్వామికి లక్ష తులసిపూజ



బాలబాలాజీ స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి కార్తీకశుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్షల తులసి పూజా కార్యక్రమాన్ని శనివారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. శనివారం అందునా కార్తీకమాసం కావడంతో దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి దేవస్థానంలో నిర్వహించే తొలి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇచ్చారు. లక్షతులసి పూజ అనంతరం శ్రీ లక్ష్మీశ్రీనివాస కూచిపూడి నృత్యాలయం అమలాపురం వారిచే నిర్వహించిన దేవాలయం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. లక్ష తులసి పూజా కార్యక్రమంలో భక్తులు గోవింద నామస్మరణలు చేస్తూ పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఏర్పాట్లు చేశారు.

కార్తీక ఏకాదశితో పోటెత్తిన భక్తులు



అలంకార శోభితుడైన అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, పోటెత్తిన భక్తులు

అమలాపురంటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురంమహిపాలవీధిలో ఉన్న శ్రీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శనివారం పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకాదశి పర్వదినం కావడంతో భక్తులుబారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు.

మహాశాంతి హోమం ఏర్పాట్లపై సమావేశం



అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 4న జరిగే మహాశాంతి హోమం ఏర్పాట్లపై కూటమి నాయకులు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొంథా తుపాన్ నేపథ్యంలో స్వామివారు తీర ప్రాంత గ్రామాలను కాపాడడంలో రక్షకుడిగా ఉంటున్నారని, స్వామివారి కోసం, ప్రజల ఆయురారోగ్యాల కోసం మహాశాంతి హోమాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేస్తున్నట్టు కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వరప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, ఆకన బాబ్జినాయుడు, చాగంటి స్వామి, బైరా నాగరాజు, పోతురాజు సురేష్, పోతాబత్తుల రాంబాబు, పొన్నాల విజయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చట్టాలు ప్రజాజీవనంలో కీలకంగా ఉపయోగపడాలి

● సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి రమణారెడ్డి



సభలో మాట్లాడుతున్న సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి రమణారెడ్డి

అమలాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చట్టాలు ప్రజాజీవనంలో మమేకమై ఉంటూ హక్కుల పరిరక్షణలో కీలకంగా పనిచేయడం తోపాటు అవసరాలు తీర్చడంలో ఇవి ఎంతో ఉపకరిస్తాయని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం ఆదేశాల మేరకు నల్సా ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు అసంఘటిత కార్మికులు, దివ్యాంగులు, ప్రత్యేక న్యాయ సేవల లీగల్ లిటరసీ శిబిరాన్ని శనివారం ఆయన అమలాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు చట్టాలు,న్యాయ వ్యవస్థల పట్ల అవగాహన పెంచుకుని మనశ్శాంతిగా జీవనాన్ని గడపాలన్నారు. ప్రాంసరీ నోట్ల మీద సంతకాలుచేసే సమయంలోనే అప్పు ఇచ్చేవారు సక్రమంగా నోటును నింపారో లేదో క్షుణ్ణంగా పరిశీలించుకుని సంతకం చేయాలని సూచించారు. తొలుత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్మికశాఖ ఐసీడీఎస్ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్మికులకు ఇశ్రమ్ కార్డులను పౌష్టికాహార కిట్లను దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. సమావేశంలో అదనపు సివిల్ జడ్జి ఎస్.శ్రీరేఖ మాట్లాడుతూ అసంఘటిత రంగంలోని కార్మికులకు చట్టపరమైన సేవలు పట్ల అవగాహన కలిగినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఎండీ రహ్మతుల్లా, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ వై.శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీఆర్డీఏ పీడీ గాంధీ పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సాయం పంపిణీ

అల్లవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలంలోని ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల వంతున బియ్యం పంపిణీ పూర్తి అయిందని తహశీల్దార్ వీవీఎల్ నరసింహం తెలిపారు. రూ.12లక్షలు నగదు వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పశ్చిమాల ఏడుకొండలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

రాజోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా తుఫాన్ బాధితులకు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, తాటిపాక సొసైటీ అధ్యక్షుడు గుండాబత్తుల తాతాజీ, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, దేవళ్లమాణిక్యాలరావు, నల్లా బాబు, కట్టా సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి కలశ పూజ

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారంలో రాయుడు సుబ్బారావు గురుస్వామి ఇంటి వద్ద అయ్యప్పస్వామి 54 కలశల పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయుడు సుబ్బారావు దంపతులు, సాయిప్రసాద్, మనీష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వాములు మేళతాళ మంగళవాయిద్యాలతో కలశలను శిరస్సుపై ధరించి పూరవీధులలో ఊరేగింపు నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు.

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): మానేపల్లిలో శనివారంరాత్రి 18 కలశాలపూజ వైభవంగా జరిగింది. మానేపల్లిలో 36వ పడి శబరిమలై యాత్ర చేస్తున్న సందర్భంగా దండపాణి గురుస్వామి దివ్య ఆశీస్సులతో సువర్ణ సింహతాలట సన్మానగ్రహీత కోనసీమ దండపాణి శ్రీజయంతి సుబ్బారావు గురు స్వామి ఆశీస్సులతో ప్రకాశ్ గురుస్వామి ఆధ్వర్యంలో కలశపూజ నిర్వహించారు. మధ్యాహ్నం మానేపల్లిలో 36ఏళ్లలో స్వామి మాలధరించిన స్వాముల ఆధ్వర్యంలో గురుశిష్యుల సమ్మేళనం జరిగింది. అనంతరంరాత్రి 18 కలశలపూజ, పడిపూజ కార్యక్రమాలు జరిగాయి.

బోధనేతర పనులను బహిష్కరిస్తాం

అంబాజీపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనేతర పనులను బహిష్కరిస్తూ ఫ్యాక్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద ఎస్టీయూ నాయకులు బోనం గంగాధర్, మండలశాఖ అధ్యక్షుడు కె.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎండీ షరీఫ్, యూటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.విశ్వప్రసాద్, పి.నారాయణమూర్తి, జి.రాంబాబు తదితరులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లకు అందించారు.

ఎఫ్ఏపీటీవో పిలుపుమేరకు ఎంఈవోకు వినతి

అంతర్వేది, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య ఆధ్వర్యంలో ఎఫ్ఏటీవో పిలుపుమేరకు సఖినేటిపల్లి మండల విద్యాశాఖాధికారులకు శనివారం వినతిపత్రం అందించినట్టు ఎఫ్ఏపీటీవో నాయకులు గుబ్బల శ్రీనివాస్ తెలిపారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాలు, బోధనా సమయం హరించుకుపోతుందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనా కార్యక్రమాలు ఉంటున్నాయని వారు తెలిపారు. పలు అంశాలపై ఎంఈవోలకు వినతిపత్రం అందించినట్టు ఉపాధ్యాయ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, గంటా శ్యామ్సన్, పి.సూర్యచంద్రరావు, కె.రమాసత్యనారాయణ, ఎం.రత్నరాజు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



బండారులంకలో అగ్నికి ఆహుతైన తాటాకిల్లు

అమలాపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బండారులంక వల్లూరువారి పుంతలో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో ఉప్పుగంటి దత్తాత్రేయుడుకి చెందిన తాటాకిల్లు అగ్నికి పూర్తిగా ఆహుతి కాగా పక్కనే ఉన్న లంకాడి నాగబాబు ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న అమలాపురం అగ్నిమాపక అధికారి ఎం.రాజా హుటీహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు రాజా తెలిపారు.

గోడ కూలి
మూడు మేకలు మృతి



ఓడలరేవులో గోడ కూలడంతో మృతిచెందిన మేకలు

అల్లవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం ఓడలరేవు గొల్లపాలెంలో శుక్రవారం రాత్రి గోడ కూలి కాటాడి చంద్రావతి ఇంటి వద్ద మూడు మేకలు మృతిచెందాయి. తమ జీవనాధారమైన మేకలు గోడ కూలి చనిపోయాయని ఆమె బోరున విలపించింది. తుఫాన్ వర్షాలకు నానిపోయి గోడ కూలి మేకలు చనిపోయినందున ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.

శ్రీనివాస్‌ను హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలి

● కొంకాపల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో



కొంకాపల్లి జాతీయ రహదారిపై బైఠాయించిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, స్థానికులు

అమలాపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37)ను హత్య చేసిన నిందితులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాస్ కుటుంబీకులు, బంధువులు, స్థానికులు శనివారం ఉదయం జాతీయ రహదారిపై కొంకాపల్లిలో బైఠాయించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులకు కొమ్ముకాసి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అందరికీ తలలో నాలుకగా ఉండే శ్రీనివాస్‌ను అతి కిరాతకంగా హత్యచేసి వారంరోజులు గడిచిందని ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదని స్థానికులు ఒక దశలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన నిందితుడైన గంగుమళ్ల కాసు సోదరి అధికారి జయవెంకటలక్ష్మి టీడీపీలో కీలక నేతగా ఉండి కేసు పురోగతిని అడ్డుకుంటున్నారని విమర్శిస్తూ లేఖ పోలీసులకు అందజేశారు. ఇప్పటికే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, దేవస్థానంచైర్మన్ కంచిపల్లి అబ్బులు తదితరులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. దశల వారీగా ఆందోళన కారులతో పోలీసులు, నాయకులు చర్చలు జరిపారు. డీఎస్పీ ప్రసాద్‌తో పాటు మెట్ల రమణబాబు ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకోను విరమించేందుకు సన్నద్ధమవుతూ శ్రీనివాస్ భార్య దేవి, ఇద్దరు చిన్న పిల్లలను చూపిస్తూ ఆ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలుచేస్తూ డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని డీఎస్పీప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం రాస్తారోకో విరమించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



రాయవరం మండలం మాచవరంలో కుళ్లిపోతున్న వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ప్రభుత్వం అండగా ఉంటుంది

• రైతులకు ఎమ్మెల్యే భరోసా • మాచవరంలో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

రాయవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం మాచవరం గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ టీంను రాష్ట్రంలో పర్యటించి రెండు రోజుల్లో ఎన్యూమరేషన్ చేసి రైతులను ఆదుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే జరిపే సమయంలో రైతులు దగ్గర ఉండి పొలాలను చూపించి సహకరించాలని కోరారు.

నిత్యావసరాల పంపిణీ: తుఫాను కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు శనివారం నిత్యావసరాలు, నగదును ఎమ్మెల్యే వేగుళ్ల పంపిణీ చేశారు. మాచవరం గ్రామానికి చెందిన 61 మందికి, వెంటూరు 24 మందికి ఎమ్మెల్యే చేతులమీదుగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. మండలంలో 12 గ్రామాలకు చెందిన 128 కుటుంబాలు, ఒంటరిగా జీవిస్తున్న 90 మందికి కలిసి 4లక్షల 74 వేలను కూటమి నేతలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే వెంట గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, మాచవరంలో సహకార సంఘం త్రిసభ్య కమిటీ మేడపాటి రవీంద్రారెడ్డి, రిమ్మలపూడి వేణుగోపాల దొర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టాలను పరిశీలించిన కేంద్ర బృందం

కె.గంగవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను వల్ల జరిగిన పంట నష్టాలను కేంద్ర బృంద సభ్యులు శనివారం పరిశీలించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు అబినాష్ దాలై, ప్రకాష్ నాయక్‌లు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఏడీఏ నాగకుమార్, ఏవో సద్గురు మూర్తితో కలిసి బాలాంత్రంలో పడిపోయిన వరి పొలాలను వారు పరిశీలించారు. పంటకు కలిగిన నష్టాలను రైతులను అడిగి వారు తెలుసుకున్నారు. యర్రపోతవరం డీసీ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, సర్పంచ్ చాగంటి సాంబశివరావు, మల్లిపూడి బుజ్జి తదితరులు పంటకు కలిగిన నష్టాలను కేంద్ర బృందానికి వివరించారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కపిలేశ్వరపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరు, కాలేరు, వడ్లమూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వల్లూరు, గ్రామాల పరిధిలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి పొలాలను ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తుగా తుఫాన్‌ను ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వాన్స్‌గా రూ.10వేల కోట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ధాన్యా న్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గేదెల శ్రీనివాస్, నాయకులు జి.రాంబాబు, కె.అంజనేయులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు మండలం పినపళ్లలో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ చౌదరి

నివేదిక తయారీలో అధికారులు నిమగ్నం

ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఆయా ప్రాంతాల్లోని వరి పంటలు అంచనాలకు అందడం లేదు. నేటికీ పలు ప్రాంతాల్లో లోతట్టులో ఉన్న పంటలు నీటిలో నానుతున్నాయి. తుఫాన్ ప్రభావం వల్ల ఆలమూరు సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 42,888 ఎకరాల్లో వరిపంటకు నష్టం కలిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాల్లో గుర్తించారు. ఈ అంచనాలపై పూర్తిస్థాయి వివరాల సేకణకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సమగ్ర నివేదికలను తయారు చేయడానికి అధికారులు నిమగ్నమయ్యారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు మండలంలోని 14 గ్రామాల్లో 4,688 ఎకరాలు, మండపేట మండలంలో 14 గ్రామాల్లో 13,070, కపిలేశ్వరపురం మండలంలో 13 గ్రామాల్లో 12,505, రాయవరం మండలంలో 10 గ్రామాల్లో 12,617 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు గుర్తించారు. సబ్‌డివిజన్ పరిధిలో పంటలను ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కేవీ చౌదరి అధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



కె.గంగవరం మండలం బాలాంత్రంలో పడిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు



కపిలేశ్వరపురం మండలంలో పాడైపోయిన వరిపొలాలను పరిశీలిస్తున్న కామన ప్రభాకరరావు

తుఫాను బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కపిలేశ్వరపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన తుఫాను బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీలో ఆయన మాట్లాడారు. అనంతరం 334 మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, పునరావాస కేంద్రాల్లో ఉన్న 17 మందికి రూ.1000 నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వల్లూరులో గ్రామ సర్పంచ్ డి.మీనాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తుఫాను బాధిత కుటుంబాలకు నగదు, బియ్యం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఏవో రాజేంద్రప్రసాద్, ఎంఎస్‌వో పద్మ, కార్యదర్శులు శివచక్రవర్తి, సత్తిబాబు, వీఆర్‌వోలు రామకృష్ణ, సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ



అద్దంకివారిలంకలో తుఫాను బాధితులకు నగదు అందజేస్తున్న లీలాకృష్ణ

కపిలేశ్వరపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంకివారిలంక, నారాయణలంక, కేదార్లంక గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన తుఫాను బాధితులు, మత్స్యకారులకు బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు నగదును శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ అందజేశారు. అద్దంకివారిలంకలో 78 మంది మత్స్యకారులకు, నారాయణలంకలో 41 మందికి, కేదార్లంకలో 48 మందికి 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. అద్దంకివారిలంకలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 13 మం దికి, కేదార్లంకలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 62 మందికి రూ.1000 నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సాకా శ్రీనివాస్, సర్పంచ్ నాతి గవరయ్య, ఆర్‌ఐ అర్జమ్మ, ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌వోలు, కూటమి నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. శనివారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో డివిజన్ అండర్ 14, 17 బాలురు, బాలికల షటిల్, యోగ, చెస్ క్రీడల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపిక పోటీలను ఆర్డీవో ప్రారంబించారు. కార్యక్రమంలో డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కెపీపీ ట్రస్టు బోర్డు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, కౌన్సిలరు తోట అమ్మాజీ, ఎంఈవో లు టి.వీర్రాఘవరెడ్డి, బి.అప్పాజీ, ఎస్‌జీఎస్ డివిజన్ ఇన్‌చార్జి ఆనిశ్రీనివాస్, మండల ఇన్‌చార్జి సీహెచ్ లక్ష్మీశ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, కార్యదర్శి ఏవీవీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో 250 మంది బాల బాలికలు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఆర్డీవో అఖిల

కోటిపల్లి గోదావరి రేవులో హోటల్ దగ్ధం

కె.గంగవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గోదావరి రేవులో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 30 ఏళ్లుగా గోదావరి రేవులో హోటల్ వ్యాపారం చేస్తున్న వక్కాం భాస్కరరావు (బోసు హోటల్) పూర్తిగా దగ్ధం అయ్యింది. టీ తయారు చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా సిలెండర్ పేలిపోయి మంటలు వ్యాపించాయని స్థానికులన్నారు. కేవలం 30 నిమిషాల వ్యవధిలో హోటల్ పూర్తిగా కాలిపోయింది. అప్పటికే మంటల్లో చిక్కుకున్న భాస్కరరావు భార్య వెంకటరత్నంను స్థానిక యువకులు పెమ్మాడి నూకరాజు, తాడి జానీ రక్షించారు. రామచంద్రపురం అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. డీఎస్పీ రఘువీర్, తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, ఆర్‌ఐ వెంకట్రావు, వీఆర్‌వో స్వామి నాయుడు, ఎస్‌ఐ ఎస్.కె. జానీబాషాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రక్రియను పరిశీలించారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం: మంత్రి సుభాష్

కోటిపల్లిలో అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రాత్రి కోటిపల్లిలో కాలిపోయిన హోటల్‌ను ఆయన పరిశీలించారు. భాస్కరరావు భార్య వెంకటరత్నంను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన ఆర్థికసాయం చేయడంతో పాటు 20కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. భాస్కరరావు భార్య వెంకటరత్నంను మంటల్లో నుంచి రక్షించిన యువకులు పెమ్మాడి నూకరాజు, తాడి జానీలను మంత్రి సుభాష్ అభినందించారు.

పేదల జీవితాలకు పింఛన్లు ఆసరా

కె.గంగవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పేదల జీవితాలకు ఆసరా లభిస్తుందని వక్తలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని మంత్రి సుభాష్ తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి బాలాంత్రం, పేకేరు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, బాలాంత్రం సర్పంచ్ చాగంటి సాంబశివరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నోడల్ అధికారి రామలక్ష్మికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ర్యాలి ఆలయంలో నోడల్ అధికారి పూజలు

ఆత్రేయపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని 108, 104 నోడల్ అధికారి రామలక్ష్మి దర్శించుకుని వేదాశీర్వచనం పొందారు. నిత్యాన్నదాన ట్రస్టుకు దాతలు వివరాలు అందజేసినట్లు ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు.

లలితా పారాయణం: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం పలువురు మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, మణిద్వీప పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



మారేడుబాకలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌లను పెంచి ఇచ్చిన హామీని నెరవేర్చిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మారేడుబాకలో శనివారం ఆయన సామాజిక పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు పసలపూడి శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అగస్త్యేశ్వర జనార్దనస్వామి తెప్పోత్సవం

మండపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండపేటలోనున్న అగస్త్యేశ్వరబోగ జనార్దనస్వామి తెప్పో త్సవాన్ని నేటి రాత్రి నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి రమణ తెలిపారు. ఈ తెప్పోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. తెప్పోత్సవంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పురుగులు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. ఆత్రేయపురం మండలం రాజవరంనకు చెందిన టి.రాముడు (50) ఆర్థిక ఇబ్బందులతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చే మార్గం లేక గతనెల 30న పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ద్వారపూడిలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

మండపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన దివంగత పొట్టి శ్రీరాములు గొప్ప మహనీయుడని వక్తలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ద్వారపూడి శివారు వేములపల్లిలో వున్న మండల పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు,, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మురళీకృష్ణ, టి.శివప్రసాద్, సత్యనారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు సీఎం చంద్రబాబు ప్రశంసలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో విశేష సేవలు అందించినందుకు మంత్రి సుభాష్‌కు సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లాలో తుఫాను సందర్భంగా అధికారులను సన్నద్ధం చేస్తూ సమర్థవంతంగా సేవలు అందించినందుకు మంత్రిని ప్రశంసించారు.

సీఎం నుంచి అవార్డు అందుకున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రాంతాల్లో ప్రజల కష్ట, సుఖాలను అర్థం చేసుకుంటూ సహాయక చర్యల్లో ముందుండి సేవలు అందించినందుకు సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రశంసాపత్రం అవార్డును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అందించారు. ఆయన సేవలను సీఎం ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇది తనకు గుర్తింపు మాత్రమే కాదని, మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నదని ఎమ్మెల్యే బండారు అన్నారు.

పురమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

మండపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మున్సిపల్ ఉద్యోగులను ఆదేశించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన పురమిత్ర యాప్‌పై మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పురమిత్ర యాప్ ఉపయోగాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించడంతోపాటు సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, మేనేజర్ బీవీ రవికిరణ్, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

లారీ యూనియన్ సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేశవరం లారీ యూనియన్ సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ చెప్పారు. కేశవరం లారీ యూనియన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. జనసేన పార్టీకి చెందిన దివంగత ఉండమట్ల రామారావు తనయుడు శ్రీనువాస్ అధ్యక్షుడిగా కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన కార్యవర్గాన్ని లీలాకృష్ణ అభినందించారు. అనంతరం కార్యవర్గం ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సత్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను సందర్భంగా విశేష సేవలు అందించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులను శనివారం లయన్స్ క్లబ్ సత్కరించింది. ఈ సందర్భంగా డీఈఈ కె.రత్నాలరావు, ఏడిఈ ఎస్.శ్రీనివాస్, ఏఈ ఎం.వెంకటరమణ, ఎల్‌ఎం ఎన్.అనిల్‌కుమార్ తదితరులను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.విశ్వతేజ, లయన్ గుణ్ణం రామకృష్ణ, లయన్ కొవ్వూరి సూర్య వంశీ మోహన కృష్ణారెడ్డి సత్కరించారు.

కపిలేశ్వరపురం డిప్యూటీ ఎంపీడీవోగా వరప్రసాద్

కపిలేశ్వరపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల డిప్యూటీ ఎంపీడీవోగా బి.వరప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మండపేట మండలం మారేడుబాక పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్‌ను ఎంపీడీవో హెచ్ భానూజీరావు, ఈవోపీఆర్డీ మోహన్, కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు అభినందించారు.

ఆర్థికసాయం

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వానపల్లి శివారు కొప్పిశెట్టిపాలానికి చెందిన ముషిణి శ్రీనివాస్ కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమయ్యాడు. ఇది తెలుసుకున్న గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సభ్యులు బాధితుడికి వైద్యం నిమిత్తం రూ.70వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో వాసంశెట్టి పెదబాబు, బొక్కా ప్రసాద్, గుబ్బల శ్రీనివాస్, కుడుపూడి రాంబాబు, కోట నాగరాజు, బైరిశెట్టి వెంకటరమణ, పిల్లి రమేష్, పిల్లి సూరిబాబు, పితాని శంకర్, కముజు వరప్రసాద్, ఇళ్ల పల్లంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

కె.గంగవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటన కోసం రామచంద్రపురం ఆర్‌టీసీ గ్యారేజ్‌ను సందర్శించారు. విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ సీహెచ్ తేజ, డిపో మేనేజర్ పి.భాస్కరరావు ఆయా అంశాలను వారికి వివరించారు.

వాసవీ పెనుగొండగా

పేరు మార్పుపై హర్షం

ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మస్థలం పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై ఆర్యవైశ్య సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల చిరకాల కోరికను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, నిమ్మల రామానాయుడులకు జొన్నాడ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాటోలు లక్ష్మీగణపతి, కొరుప్రోలు సత్యనారాయణరావు, బొడ్డు శ్రీనివాస్, కొండూరి సీతారామగుప్తా, బొడ్డు మణికంఠ, అత్తులూరి దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు చెముడులంకలో పరిశ్రమల స్థాపనపై సదస్సు

ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే నిర్ణయంలో భాగంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో 3న చెముడులంకలో యువతీ, యువకులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. చెముడులంక కృష్ణదేవరాయ కల్యాణ మండలంలో సోమవారం ఉదయం పది గంటలకు సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో పలు అంశాలపై జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని యువతీ, యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి హాజరు కావాలని ఎంపీడీవో రాజు కోరారు.



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో 11 కాయల అరటి అత్తాన్ని చూపిస్తున్న వ్యాపారి

11 కాయల అరటి అత్తానికి గిరాకీ

రావులపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో నోములు, వ్రతాలకు 11 కాయల అరటి అత్తానికి ఎక్కువ డిమాండ్ ఉంటుంది. వందలాది అరటి గెలల్లో కొన్నింటికి మాత్రమే అత్తానికి 11 మాత్రమే ఉంటుంది. కార్తీక మాసంలో దీనికి డిమాండ్ ఎక్కువ. రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో ప్రతి ఏడాది కార్తీకమాసంలో రైతులు 11 ఉన్న అత్తాన్ని విక్రయిస్తుంటారు. కొత్తగా పెళ్లయిన దంపతులు కార్తీక పౌర్ణమి నాడు నోములో 11 కాయల అరటి అత్తాన్ని వినియోగించి పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం దీనికి రూ.250 నుంచి రూ.400 వరకూ డిమాండ్ పలుకుతోంది.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

ఆత్రేయపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదర్శన నిర్వహిస్తున్న ఇద్దరు భక్తుల నుండి సెల్‌ఫోన్లు అపహరించి పారిపోతుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం శనివారం ఏకాదశి కావడంతో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,15,084 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆకట్టుకున్న కార్తీక దీపాలు

ఆలమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి శనివారం కావడంతో మండలంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలమూరులోని జనార్దనస్వామి ఆలయం, చింతలూరు, గుమ్మిలేరు గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ఏకదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలువురు కార్తీక దీపాలను వెలిగించారు.



చింతలూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం

విశ్వేశ్వరస్వామి ఆలయంలో సామూహిక లక్షపత్రి పూజ

కె.గంగవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయంలో వేద పండితుడు వెలవలపల్లి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పండితులు మహాన్యాసము, ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్యనమస్కారాలు, శిఖరాగ్ర కుంభాభిషేకము, లక్షపత్రిపూజ, కుంకుమార్చన, గణపతి హోమం, నవగ్రహ హోమాలు, జ్యోతిర్లింగార్చన, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పాలు తదితర క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన వేంకటేశ్వరస్వామి ఆలయం

రాయవరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారాన్ని పురస్కరించుకుని రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. అర్చకుడు అంగర బాబు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి అమ్మవార్లకు వెండి కవచ అలంకరణ జరిపి అష్టోత్తర నామాలతో తులసిదళ అర్చనలు, అమ్మవార్లకు కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసం శనివారం సందర్భంగా మండలంలోని పలు వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.